# దశమ గ్రహం

- తమిరిశ జానకి

"అది సరేగానీ గాయత్రీ! ఆ ఊళ్ళో ముసలాళ్ళిద్దరికీ డైనింగ్ టేబుల్ ఎందుకు చెప్పు? మనకి పంపించెయ్యమని చెప్పు.... ఉత్తరంరాయి" తన మనసులో కోరిక బయట పెట్టుకున్నాడు రవిచంద్ర.

పెళ్ళయి మూడునెల్లయింది.

నెల్లాళ్ళకిందటో సారిలాగ్గే మురిపెంగా మాట్లాడుతున్నట్టే మాట్లాడుతూ ఆ టూ ఇన్ వన్ వాళ్ళ కెందుకూ మనకివ్వమని ఉత్తరం రాయి అంటూ రాసే దాకా వొదల్లేదు.

కొత్త కాపరం.... భర్త మాట కాదన్లేక ఎంతో ఇబ్బందికి లోనవుతూనే బామ్మకి రాసింది ఉత్తరం. వెంటనే తాతయ్య తీసుకొచ్చి ఇచ్చివెళ్ళాడు కానీ ఆయనకి మనసు చివుక్కు మన్న మాట నిజం.... ఎందుకంటే... ఆ దంపతులకి ఇంట్లో ఉన్న కాలక్షేపం అదొక్కటే మరి...

"బావుండదేమోనండీ డైనింగ్ టేబుల్ పంపమని రాస్తే" నసిగింది మెల్లిగా. "ఎందుకు బావుండదూ? అయినా మీ బామ్మా తాతయ్యల్ని అడగడానికి నీకు మొహమాటం ఎందుకూ? నువ్వడగాలే గానీ మహరాజులా పంపిస్తారు? ఓ ఉత్తరమ్ముక్క రాసి పడెయ్య" కవరందించి రాసేదాక ప్రాణం తీశాడు.

!+!+!+!

"ఈ డైనింగ్ టేబుల్ సెట్‌తో ఈ గదికి ఎంత అందం వొచ్చిందో చూశావా? మురిసిపోతున్న భర్తని చూసి చిన్నగా నిట్టూర్చింది గాయత్రి.

ఆమెకే మాత్రం ఆనందంగా లేదు ఆ ఫర్నీచర్ చూసి.

రోజులు గడుస్తున్న కొద్దీ భర్త మనస్తత్వం కొద్ది కొద్దిగా బోధపడుతోంది. అతని స్వభావం బయటపడుతున్న కొద్దీ భయం పెరిగిపోతోంది.

!+!+!+!

"గాయత్రీ... గాయత్రీ" ఆఫీసునుంచి వొస్తూనే హడావిడిగా పిల్చాడు రవిచంద్ర.

"ఏవిటండీ?" కంగారుగా వంటింట్లోంచి ఇవతలికొచ్చింది గాయత్రి.

"ఇవాళేవన్నా ఉత్తరాలొచ్చాయా?"

"అబ్బ! అంతే కదా! ఇంకేవిటో అనుకుని హడిలిపోయాను. ఉత్తరాలేం రాలేదు. అయినా... ఎవరి దగ్గిర్నించో అర్జంటు ఉత్తరం రావల్సి ఉన్నట్టుగా రోజూ చాలా ఆతృతగా అడుగుతున్నారు... ఎక్కడినించి రావాలి?"

"అబ్బే! అదేం లేదు... గాయత్రీ... మరి... మరి..."

"ఏవిటండీ అలా నసుగుతున్నారు? అసలు విషయం చెప్పండి..."

" మరేం లేదు... పండగ దగ్గిరకొస్తోంది కదా! మనిద్దర్నీ పండక్కి రమ్మని మీ తాతయ్య దగ్గిర్నించి ఉత్తరం రావాలి కదా!"

నవ్వాపుకోలేక పకపక నవ్వేసింది గాయత్రి.

వింతగా చూశాడు "ఎందుకలా నవ్వుతావు?"

"నవ్వకేం చెయ్యమన్నారు? పండక్కి రమ్మన్న పిలుపు కోసం ఆడపిల్లని నేనే ఎదురు చూడట్లేదు... ఆ కోరికా ఆతృతా మీకెందుకండీ మధ్యన? నాకైతే ఇక్కడే... ఈ ఊళ్ళోనే... మనింట్లోనే పండగ జరుపుకోవాలనుంది. పోనీ ఒకపని చేద్దావండీ... మా బామ్మా తాతయయల్నే పండక్కి ఇక్కడికి రమ్మని పిలుద్దామండీ..." ముచ్చటపడుతూ అడిగింది.

"చాల్లే ఊరుకో..." ఇల్లదిరిపోయేలా అరిచాడు.

అతని కంత కోపం ఎందుకొచ్చిందో అర్థం కాలేదు ఆమెకి.

"పండక్కి మనల్ని వాళ్ళు పిలవడం మర్యాద కానీ.. వాళ్ళని మనం పిలవడం ఏమిటి? కూతురివైనా మనవరాలివైనా అన్నీ నువ్వేగా వాళ్ళకి? అల్లుడినీ కూతురినీ పిల్చి ఏవైనా పెట్టే బాధ్యత వాళ్ళకి లేదా?"

"వెనక ఆస్తిపాస్తులేమీ లేవు తాతయ్యకి. నేను ఏడాది పిల్లగా ఉన్నప్పుడే అమ్మా నాన్న ఒకేసారి యాక్సిడెంట్లో పోవడం జరిగింది. గుండెల్లోనే బాధ దిగమింగుకుని... రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడి ఒళ్ళొంచి పనిచేస్తూ నన్ను కంటికి రెప్పలా పెంచి కాలేజి చదువులు చెప్పించి పెళ్ళి చేసి పంపించారు. ఇంకా వాళ్ళనించి నాకేవో పెట్టుపోతలు కావాలని నేనాశించడం లేదండీ..."

"చాల్చాల్లే... మహా చెప్పొచ్చావు. లోకంలో ఏ పుట్టింటి వాళ్ళయినా చేసే పనే అది... ఆ మాత్రం నీకు తెలియదా?"

"కాలం మారిందని మీరు తెల్సుకోడం చాలా మంచిది. అవీ ఇవీ అత్తారింటి నించి ఆశించి రాబట్టుకోవాలని చూసే భర్తని ఏ భార్య ఇష్టపడదు."

"ఏం కూశావ్?" కోపంతో చెయ్యి పైకి లేచింది.

"కొట్టే భర్తని కూడా ఈ కాలం ఆడపిల్ల అసహ్యించుకుంటుంది. మర్చిపోకండి" తలవొంచుకుని చాలా నెమ్మదిగానే అయినా పదునుగానే చెప్పింది గాయత్రి. మరి ఒక్క క్షణం అక్కడ నిలబడలేదు"

!+!+!+!

రవిచంద్ర ఎదురు చూసిన ఉత్తరం రానే వొచ్చింది. అంతకు ముందు రోజు భార్యతో దెబ్బలాడిన విషయం పక్కకి పెట్టి ప్రయాణమయ్యాడు. అయిష్టంగానే... అన్నమనస్కంగానే భర్తతో ప్రయాణమైంది గాయత్రి.

!+!+!+!

"ఛీ... ఛీ... ఇలాంటి బట్టలు పెట్టాడేవిటి మీ తాతయ్య?"

"ఏమైందండీ? ఆ బట్టలకేం బాగానే ఉన్నాయిగా?"

"ఇలాంటి తక్కువ ఖరీదు బట్టలు పెడతాడా?"

"వాళ్ళకి మన మీదున్న ప్రేమా ఆప్యాయతా విలువైనవి... అవి చూడాలిగానీ... వాళ్ళు పెట్టే బట్టల ఖరీదు చూడకూడదండీ మనం..."

"కబుర్లు చెప్పకు. వాళ్ళకి పదిమందున్నారా పెట్టుపోతలు జరిపించుకోవలసిన వాళ్ళు? మనవరాలివి నువ్వొక్కదానివేగా?"

"ఒక్కదాన్నయితే మాత్రం? రేపన్నది లేదా వాళ్ళకి? పొదుపుగా బతకనక్కర లేదా? గొప్పల కోసం ఆడంబరాల కోసం పోయి అప్పులు చేసే మనిషి కాదు మా తాతయ్య. ఒకసారి అప్పు చెయ్యడం మొదలు పెడితే అదొక వ్యసనంలా అంటుకుంటుదని ఎప్పుడూ అంటాడు తాతయ్య".

"నీ లెక్చర్లు వినే ఓపిక నాకులేదు. అసలు నిన్నెందుకు పెళ్ళి చేసుకున్నానో తెల్సా? తల్లీ తండ్రీ లేని పిల్లవి... తాతా బామ్మలకి ఒక్కతే మనవరాలివి. మనం అడిగినవీ అడగనివీ కూడా ఇస్తూ ఉంటారు... అల్లుడి దర్జా డాబూ దర్పం అన్నీ నేను చూపించుకోవచ్చునీ చేసుకున్నాను..."

కాళ్ళకింద భూమి కదిలినట్టయింది గాయత్రికి.

ఇంతకంటే అవమానం ఉంటుంది అనిపించింది. ఇదా ఇతని అసలు స్వరూపం?

ఇప్పుడు నామనసులో మాట ఇంకోటి కూడా చెప్తున్నానువిను. ఈ ఇల్లు వెంటనే మన పేర్నరాసెయ్యమను మీ తాతయ్యని... మన అంటే అదేలే... నా పేర్న రాసెయ్యమను..."

"వాళ్ళ తదనంతరం మనకొస్తుంది.. ఇప్పుడే ఎందుకురాయాలి?"

"అదేదో ఇప్పుడే రాయమంటున్నాను అంతేగా?"

"అంతేగా అని చాలాతేలిగ్గా అంటున్నారే!"

"నోర్మూసుకుని చెప్పినట్టు చెయ్యి. అడుగుతావా అడగవా?"

"అడగలేనండీ"

"నీకెంత పొగరు! నామాటకి ఎదురు చెప్తావా?"

"ఎదురు చెప్పడం కాదండీ... మిమ్మల్ని అర్థం చేసుకోమంటున్నాను దయచేసి..."

ఆమె మాట పూర్తికాకుండానే మళ్ళీ గయ్యిమన్నాడు.

"నా మాటకి ఎదురు చెప్పావంటే విడాకులిచ్చేస్తాను జాగర్త.

పాతకాలపు మీ బామ్మ... నలుగుర్లోనూ తలెత్తుకోలేక సిగ్గుతో అవమానంతో బాధతో గుండెపగిలి చస్తుంది..."

"లేదు బాబు లేదు ఛావను"

ఉలిక్కిపడి చూశాడు రవిచంద్ర.

గుమ్మంలో నిలబడి ఉంది కాంతమ్మ.

"బామ్మా!" ఒక్క పరుగున వెళ్ళి ఏడుస్తూ బామ్మ కౌగిట్లో ఒదిగిపోయింది గాయత్రి.

"ఊరుకో తల్లీ" బాధపడకు. చూడు బాబు రవిచంద్రా! నువ్వనుకున్నట్టు నేను సిగ్గుపడను... గుండెపగిలి చావను. మా మనవరాలికేం? చదువుకుంది. దానికి ఒక మృగంతో కాపరంచేసే రాత తప్పిందని సంతోషిస్తాను. నేను వయసుని బట్టి చూస్తే పాతకాలపు దాన్నే... నిజమే.. కానీ కట్టుకున్న వాడు కంటతడి పెట్టిస్తే వాడొక మృగంలానో చండశాసనుడిలానో ప్రవర్తిస్తే వాడితోనే జీవచ్ఛవంలా ఏడుస్తూ బతకాలని నీతులు చెప్పే పాతకాలపు దాన్ని కాదు నేను.తనకాళ్ళమీద తనని ధైర్యంగా నిలబడమని వెన్ను తట్టి చెప్తాను." స్థిరంగా పలికింది కాంతమ్మ స్వరం.

సిగ్గుతో రవిచంద్ర తల వొంగిపోయింది.

★☆★☆★